ప్రజాశక్తి

శనివారం 8 మార్చి 2025 | 5 | పార్వతీపురం మన్యం

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రక్తహీనత నివారణ మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు ఎనీమియా యాక్షన్ కమిటీలు బాధ్యతగా వ్యవహరించాలని పార్వతీపురం అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవిచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన రక్తహీనత నివారణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యకేంద్రాల సిబ్బంది ఒకరికొకరు అనుసంధానంగా పనిచేసి మహిళల్లో రక్తహీనత నివారించేందుకు పటిష్టమైన చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఎంపిడిఒ రమణమూర్తి, ఎపిఎం సన్నిబాబు, ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎక్కడమ్మా నువ్వు లేనిది

- ఊరిలో అధికారిగా...
- పోరులో అధినేత్రిగా..
- ఇంటి నడిపే ఇల్లాలిగా..
- సమాజ గమనంలో స్త్రీల పాత్ర అత్యంత కీలకం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

'ఎక్కడమ్మా.. నీవు లేనిది?, ఏమిటీ నీవు చేయలేనిది' అని కీర్తింపబడుతున్న మహిళ ఒక వైపున అన్ని రంగాల్లో రాణిస్తుండగా, మరోవైపు అడుగడుగునా అణచివేతకు గురవుతోంది.. నవమాసాలూ మోసి, పిల్లల్ని కని తల్లిగా లాలిస్తూ, పాలిస్తూ పెద్ద చేస్తోంది.. సోదరిగా ప్రేమానురాగాలను పంచుతోంది.. భార్యగా జీవితంలో సగభాగమై ముందుకు సాగుతోంది.. ఉద్యోగిగా సమాజానికి తన వంతు సేవలందిస్తోంది.. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులు ఎదురైనా పుట్టెడు సహనంతో ముందుకు సాగుతోంది.. ఇలా మహిళ అన్నింటా కీలకంగా వ్యవహరిస్తోంది.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డాక్టర్ నుంచి యాక్టర్ వరకు, కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు, హోంగార్డు నుంచి మేజర్ వరకు రాణిస్తోంది.. క్రీడా, కళా, రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు తెచ్చుకుంటున్నారు. వ్యవసాయ రంగంలోనూ వారిదే కీలకపాత్ర. ఇలాంటి వారు మన జిల్లాలోనూ కోకొల్లలుగా కనిపిస్తారు. ఇలా అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా పోటీ పడుతూ, కష్టపడుతున్నా మహిళలు అన్నింటా అణచివేతకు, వివక్షతకు గురవుతున్నారు. ఆఖరికి అమ్మాయి పుట్టుకే అశుభమనుకునే స్థాయికి నేటి సమాజం దిగజారి పోయింది. ఆడబిడ్డగా నిర్ధారణ అయితే భ్రూణహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఇంటి గుమ్మం దాటితే తలదించుకోవాలన్న దగ్గర నుంచి మగాళ్లతో మాట్లాడకూడదన్న వరకు అన్నీ ఆంక్షలే. పని ప్రదేశాల్లో మహిళలు ఆర్థిక, లైంగిక దోపిడీకి గురవుతు న్నారు.

మరుగుదొడ్లు సైతం లేక ఆత్మగౌరవాన్ని చంపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా చెప్పాలంటే మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నా, వారి కుటుంబసభ్యులే పెత్తనం చలాయిస్తున్నారు. వరకట్నం, వేధింపులు, అణచివేత నేపథ్యంలో ఆడపిల్లలంటే ఎంతోమంది భారంగా భావిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మహిళలకు మరిన్ని కష్టనష్టాలు ఎదురౌతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఆకాశంలో సగంగా ఉన్న మహిళ సగర్వంగా తలెత్తుకు తిరగాలని, భవిష్యత్తు మరింత దేదీప్యమానం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

పోరాట చిహ్నమే..

మహిళలకు ఓటు హక్కు కల్పించాలని, స్త్రీ, పురుషులకు సమాన వేతనం కల్పించాలని, పనిగంటలు తగ్గించాలని, 1908లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. దీనికి స్ఫూర్తిగా అక్కడి సోషలిస్టు పార్టీ 1909లో అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించి వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. క్రమంగా ప్రపంచ దేశాలకు ఈ కార్యక్రమం విస్తరించింది. ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తున్నాయి. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. ప్రస్తుతం అన్ని పార్టీలు, ప్రభుత్వాలు నిర్వహించాల్సిన పరిస్థితి, ఆవశ్యకత ఏర్పడింది.

మహిళా రిజర్వేషన్లపై చిత్తశుద్ధి కరువు

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అందువల్లే అమలు చేయలేదు. స్త్రీ, పురుష సమానత్వం దేశవ్యాప్తంగా అమలు కావడం లేదు. మహిళలను అవమానపరిచే ఘటనలు గడిచిన పదేళ్లుగా పెరిగాయి. శ్రామిక మహిళలు సాధించిన హక్కులు, చట్టాలు రక్షించబడాలంటే రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి. రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి మహిళలు ఉద్యమించాలి. కానీ, అదే రాజ్యాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయి. కనీసం పోరాడి సాధించుకున్న మహిళా చట్టాలను సమర్థవంతంగా అమలు చేసే పరిస్థితి నేడు కనిపించడం లేదు. సమాన పనికి సమాన వేతనం కల్పించడం లేదు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి పోరాటానికి మహిళలు సిద్ధం కావడమే నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కర్తవ్యం కావాలి.

- కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

నేటి సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర చాలా కీలకమైంది. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. బాలికలను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలి. చదువు మధ్యలో ఆపేసి ఆడపిల్లలకు వివాహాలు చేయడం మానుకోవాలి. బాల్యవివాహాలు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నిరోధకాలు. సమాజంలో మగ, ఆడపిల్లల పట్ల వివక్ష, చులకన భావం పోవాలి.

- డాక్టర్ విఆర్ మీనాక్షి, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, సాలూరు

బాలికా విద్యను ప్రోత్సహించాలి

పార్వతీపురం: మహిళలు రాణించలేని రంగం అంటూ లేదు. ఏ రంగంలోనైనా మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తునానరు. కాబట్టి తల్లిదండ్రులు బాలికల విద్యను ప్రోత్సహించాలి. వారిని ఉన్నత చదువుల వరకు పంపించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్య కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. దళిత మహిళగా ఒక ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టి ఈరోజు జిల్లా వృత్తి విద్యా అధికారి స్థాయి వరకు చేరాను. మహిళల రక్షణకు అనేక చట్టాలు వున్నాయి.

- డి.మంజులవీణ, డివిఇఒ

వట్టిగెడ్డను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జ్వరాలపై అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు అనుమానితులను రక్తపరీక్షలు నిర్వహించి తీవ్రతరం కాకుండా అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. జియ్యమ్మవలస మండలంలోని రావాడ రామ భద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రోగులతో ముఖాముఖి మాట్లాడారు. ఎక్కడ నుంచి వచ్చారు, ఏ ఏ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చింది రోగుల నుంచి విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నదీ, లేనిదీ ఆరా తీశారు. మలేరియాతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరినట్లు బాధితులు తెలపగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు చీకటి శంకరరావును ఆదేశించారు. పిహెచ్‌సిలోని జనరల్ వార్డు, లేబర్ గది, రక్త పరీక్షలు నిర్వహణ వివరాలు, మందుల నిల్వలు నిశితంగా పరిశీలించారు. మందుల కొరత ఏమైనా ఉందా అంటూ ఫార్మాసిస్ట్ అనితను ప్రశ్నించగా సరిపడా మందులు ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మందులు అవసరమైతే ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి వినియోగించాలని సూచించారు. జ్వరాలకు కారణాలను వైద్యులను ప్రశ్నించగా వేసవి తీవ్రత, సీజనల్‌గా వస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారితో ఫోన్లో మాట్లాడి గ్రామాల్లో జ్వర బాధితులు, రోజువారీ వైద్య నివేదికలను తక్షణమే పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రక్తపరీక్షలు నిర్వహించి జ్వరాలు తీవ్రం కాకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రత పాటించడం, కలుషిత నీరు తాగకుండా జాగ్రత్తలు పాటించేలా వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. వైద్య సేవలు సకాలంలో అందించడంలో నిర్లక్ష్యానికి తావివ్వరాదని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రెడ్డి పకీరు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రావాడ, ఒట్టి గెడ్డ రిజర్వాయర్‌ను కలెక్టర్ పరిశీలన

అనంతరం మండలంలోని రావాడ, ఒట్టిగెడ్డ రిజర్వాయర్లను కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్ల పరిధిలోని విస్తీర్ణం, ఆయకట్టుకు అందుతున్నా సాగునీరు వివరాలను అడిగితెలుసుకున్నారు. 17 వేల ఎకరాల ఆయకట్టుకు కుడికాలువ ద్వారా 12 వేలు, ఎడమ కాలువ కింద 5 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుందని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.అప్పల నాయుడు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో నీటి వనరులతో పాటు సుందరమైన ప్రాంతాలు ఉన్నందున సద్వినియోగం చేసుకొని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధికి ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఒట్టిగెడ్డ రిజర్వాయర్ అధ్యక్షులు ఎం.సత్యం నాయుడు, వైస్ చైర్మన్ ప్రసాద్, తహశీల్దార్ రెడ్డి పకీర్, ఆర్ఐ సీతారామరాజు, విఆర్ఒ ఎస్.బంగారి, తదితరులు, పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం సందర్శన

కురుపాం తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం.రవణమ్మకు పిజిఆర్ఎస్, పిఒఎల్ఆర్, ఎంఎస్ఎంఇ సర్వే, మ్యుటేషన్ల పరిష్కారం, పీ 4 సర్వే నిర్వహణ తీరు అంశాలపై వివరాలను, ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలను అడిగి తెలుసుకొని సర్వేలన్నీ త్వరతగతిగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంఎస్ఎంఇ సర్వే పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

గుమ్మలక్ష్మీపురం : పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. జియమ్మ వలస మండలంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసుకొని బాగా రాణించాలని అన్నారు. పరీక్షలకు తక్కువ సమయం ఉండడంతో ఎక్కువ శాతం చదువుపై దృష్టి సారించాలని అన్నారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తామని కలెక్టర్‌తో కలిసి విక్టరీ గుర్తు చూపించారు.

నగర పంచాయతీ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జయరాం

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా టి.జయరాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కమిషనర్ సర్వేశ్వరరావు ఏసీబీకి చిక్కడంతో సస్పెండ్ అయ్యారు. దీంతో మేనేజర్‌గా ఉన్న జయరాంకు అదపున బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా చైర్మన్ పల్లా ప్రతాప్‌ను తన కార్యాలయంలో కలిసి నగర పంచాయతీకి సంబంధించి పలు విషయాలపై మాట్లాడారు. అలాగే కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, కె.విజయకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు.

జనరిక్ మందులపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జనఔషధి దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ మేరకు డిసిహెచ్ఎస్ డాక్టర్ వాగ్దేవి,వైద్యశాఖ అధికారులతో కలిసి జనరిక్ మందులపై అవగాహన కల్పించారు. జనరిక్ మందులు బ్రాండ్ నేమ్ మందుల కంటే తక్కువ ధరలో లభిస్తాయని, వీటిలో ఉండే రసాయన పదార్థాలు, మోతాదు, రూపం, ఫలితాలు బ్రాండ్ నేమ్స్ డ్రగ్ మాదిరిగానే సమానంగా ఉంటాయన్నారు. చికిత్స విషయంలో జనరిక్ మందులు బ్రాండ్ నేమ్ మందులు మాదిరిగా అదే క్రియాశీలతను కలిగి ఉంటాయన్నారు. బ్రాండ్ నేమ్ డ్రగ్ ధరతో పోల్చితే 80 నుండి 85 శాతం తక్కువ ధరలో లభిస్తాయన్నారు. బ్రాండ్ ఔషధాలపై పేటెంట్ల గడువు ముగిసిన తర్వాత జనరిక్ ఔషధాలను విక్రయించడానికి అనుమతిస్తారన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ వినోద్, ఏఎంఓ సూర్యనారాయణ, కన్సల్టెంట్ రామచంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

మహిళల పట్ల గౌరవంతో మెలగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరూ మహిళల పట్ల గౌరవంతో మెలగాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. శనివారం జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మహిళా శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల భవనం నుంచి జరిగే 2 కె రన్ కలెక్టర్ హాజరై జెండా ఊపి ప్రారంభిస్తూ విద్యార్థులు మహిళా శిశు సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ మహిళల పట్ల గౌరవం చూపించాలని, ప్రతి ఒక్కరూ గౌరవంతో మెలగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగస్వామ్యమైన ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, డిఇఒ డాక్టర్ ఎస్.తిరుపతి నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ఇతర జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంబరలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వరపీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా హక్కులు మానవ హక్కులే

ఐద్వా ఆధ్వర్యాన ప్రదర్శన

ప్రజాశక్తి - పార్వతీపురం

మహిళలు, చిన్నారులపై ఆకృత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రామిక మహిళా, సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా సుందరయ్య భవనం వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన స్థానం కల్పించాలని భారత రాజ్యాంగం పేర్కొంటుందని, చట్టం ముందు అందరూ సమానులేనని భారత శిక్షాస్మృతి స్పష్టం చేస్తున్నప్పటికీ ఇవన్నీ కాగితాలకే పరిమితం కానున్నాయని విమర్శించారు. పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు అన్ని విధాలా రక్షణ కల్పించే బాధ్యత ఆయా సంస్థలతో, ప్రభుత్వ ప్రైవేట్ పరిశ్రమలు తదితరాల్లో పురుషులతో పాటు పనిచేస్తున్న శ్రామిక మహిళలకు రక్షణ కల్పించబడుతుందా లేదా అనేది పర్యవేక్షించాల్సిన ప్రభుత్వాలు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. వాటి పాపాన శ్రామిక మహిళలు, విద్యార్థినిలపై వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు నానాటికీ పెరుగుతున్నాయని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో అనేక చోట్ల మహిళలు, పిల్లలు, విద్యార్థులపై అఘాయిత్యాలకు అంతేలేకుండా పోతుందని వివరించారు. విద్యావ్యవస్థలో ఎక్కడ చూసినా సమానత్వానికి సంబంధించిన అంశాలు బోధించకుండా, సమాజంలో మహిళల పట్ల వ్యక్తికి ఉండాల్సిన బాధ్యతను చెప్పకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ముందడుగు వేయాలని ఆశించడం దుస్సహాసమని అన్నారు. వీటి చర్యలు అరికట్టేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు పూర్తిగా విఫలమవుతున్నాయని విమర్శించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు వేయాలన్న సుప్రీంకోర్టు నిబంధనలు అమలు చేయాలని, శ్రామిక మహిళలు, చిన్నారులపై వేధింపులు ఆపాలని, మహిళా సాధికారతకు బడ్జెట్లలో తగిన నిధులు కేటాయించాలని, అలాగే రాజ్యాంగబద్ధంగా మహిళల హక్కులు కాలరాయకుండా ఉండేందుకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జ్యోతి, మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి, మహిళా సంఘం నాయకులు బి.లక్ష్మి, పి.వరహాలు, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.రాజు ప్రజాసంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి

ర్యాలీ చేస్తున్న ఐద్వా నాయకులు

పశువైద్య కళాశాల విద్యార్థుల

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-చీపురుపల్లి

గరివిడిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం ఆ కళాశాల గేటు వద్ద నిరసన చేపట్టారు. 33 రోజుల నుంచి పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వెటర్నరీ విద్యార్థులు రోడ్డు పాలయ్యారన్నారు. ఆరోగ్య సంబంధిత విద్యా రంగాల్లో ఇంటర్న్ పీజీలు, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.25 వేల నుంచి 65 వేల వరకు స్టైఫండ్‌ను ప్రభుత్వం ఇస్తోందన్నారు. వెటర్నరీ విద్యార్థులకు రూ.7 వేలు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పశువుల రక్షణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెటర్నరీ విద్యార్థుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఇ.వంశీ, సిహెచ్ రమణ, చీపురుపల్లి మండల కమిటీ సభ్యులు మధు, జగదీష్, నాని, నీలిమ, చైతన్య, సాయి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

సిఐటియు నాయకులపై నమోదైన కేసును శుక్రవారం మొబైల్ కోర్టు కొట్టివేసింది. 2018లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఒకటో పట్టణ పోలీసులు.. సిఐటియు నాయకులు ఎం.కృష్ణమూర్తి, టివి రమణతోపాటు 20 మందిపై కేసు నమోదు చేశారు. ఆరేళ్ల విచారణ అనంతరం పోలీసులు పెట్టిన కేసు సరైనది కాదని మొబైల్ కోర్టు జడ్జి నిర్ధారించారు., సిఐటియు నాయకులు, కార్మికులు తప్పు చేసినట్లుగా నిర్ధారణ కాలేదని, ఈ కేసును కొట్టివేస్తున్నట్లుగా తీర్పు ఇచ్చారు. ఈ కేసులో కార్మికుల తరుపున న్యాయవాది కె.సన్యాసిరావు వాదించారు.

అర్హులకు వ్యవసాయ పరికరాలివ్వండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలు అర్హులైన రైతులకు అందించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐదు మండలాల వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 50శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల ఎఒలు సిహెచ్ ప్రసాదరావు, పి.శంకరరావు, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ వ్యవసాయాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

25నుంచి కైలాసనాథ యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో ఈనెల 25 నుంచి కైలాసనాథ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. యాత్ర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే మే 12 నుండి 21 వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండి సహాయ సాకరాలు అందిచాలని కోరారు.

ఖరీఫ్ ప్రణాళికపై శిక్షణ : డిపిఎం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయంలో సీతంపేట, భామిని, కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు చెందిన వంద మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక కార్యక్రమం విజయవంతం కావాలంటే అందుకు తగిన ప్రణాళిక తయారు, కృతనిశ్చయంతో అమలు చేయడం వల్ల ప్రయోజనం కలుగుతుందని, వ్యవసాయ కార్యక్రమాలతో పాటు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల రైతులు త్వరితంగా అభివృద్ధి చెందుతుందని, కార్యకర్తలు తమకు సంబంధించిన రైతుల వివరాలు ఖరీఫ్ ప్రణాళిక తయారీలో అన్ని రకాల అంశాలను, సమగ్ర రూపంలో నమోదు చేయాలని, సామాజిక వనరులు, ఆర్థిక వనరులు, భౌతిక వనరులు, ఉపాధి కలిగించే వనరులు మొదలగునవి సమ్మేళనం చేయడానికి జిల్లాలోని వ్యవసాయశాఖ, డిఆర్‌డిఎ, ఉపాధి హామీ, సెరీకల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్, మొదలగు అన్ని శాఖల సమన్వయంతో కలిసి ఖరీఫ్ ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. రైతుల అవసరాలను గుర్తించి, అవి ఆచరించేలా ప్రణాళికలు తయారు చేసి అమలు చేయడం కీలక పాత్ర పోషించాలని, ఎంత విస్తీర్ణం, ఎన్ని రకాల పంటలు పండిస్తున్నారు, ఏడాది పొడవునా పంటలు పండించే విస్తీర్ణం మొదలగు వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, మట్టి, ఘన జీవామృతం, బూడిదతో కలిపి గుళికలుగా చేసి పొలంలో వేసినచో వర్షం పడిన వెంటనే తప్పనిసరిగా అన్ని రకాల విత్తనాలు మొలకలు వస్తాయని, క్రిమికీటకాల నుంచి గాని, ఎండ తీవ్రత వల్ల గాని నష్టం కలగకుండా ఉంటుందని అన్నారు. ఇలా ఆరు నెలలు వరకు భూమిపై ఉన్న నష్టం కలగదని, జిల్లాలోని 15 మండలాల్లో విత్తనగుళికల తయారీకి ప్రణాళికలు వేసి ఆచరించేలా కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు. విత్తన గుళికలు డెమో చూపించారు. కార్యక్రమంలో జి.అన్నపూర్ణ, ఆర్.శ్రీనువాస్, శారద, ముసలయ్య, దేవీప్రసాద్, నిర్మల, శ్రీరామ్, అంబోజీ, స్వామి నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న పివిటిజి నవ్వ

చిరుధాన్యాల ఉత్పత్తిలో నవ్వకు పురస్కారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చిరుధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేస్తున్న మండలంలోని పి.ఆమిటి పంచాయతీ వంజరపుగూడకు మద్రి నవ్వను ఆదివాసీ (పివిటిజి) మహిళకు మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలో అధికారులు ఉత్తమ పురస్కారంతో సత్కరించారు. ఏజెన్సీలో పండించే చిరుధాన్యాలతో వివిధ ఉత్పత్తులు తయారు చేసినందుకు ఆమెకు ఉత్తమ పురస్కారం లభించింది. ప్రకృతి వ్యవసాయ విధానంతో చిరుధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులను కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మహిళా రైతుల భాగస్వామ్యంతో శ్రీలక్ష్మి ప్రొడక్ట్ ఎఫ్‌పిఒ స్థాపించారు. ఇటువంటి గిరిజన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తే మరికొంత మందికి స్వయం ఉపాధి అవకాశాలు చేకూరుతాయని ఏజెన్సీ ప్రాంత మహిళలు చెబుతున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా సురేష్ కుమార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రావాడ రామభద్రపురంలో పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్న రెడ్డి సురేష్‌కుమార్‌ను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ఎస్టీఆర్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కెవి వెంకటరావు, మన్యం జిల్లా అధ్యక్షులు జివికెఎస్ కిషోర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ల్యాబ్ టెక్నీషియన్స్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ల్యాబ్ టెక్నీషియన్స్ సమస్యలపై నిరంతరం పోరాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. కాగా తమ ఆసుపత్రి సిబ్బంది సురేష్ కుమార్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు రావాడ రామభద్రపురం వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్.శంకరరావు, డాక్టర్ శ్రుతి ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

సదరం సర్టిఫికెట్ల విచారణ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -కొమరాడ

అర్హులకు మాత్రమే పెన్షన్ అందాలని కోరుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్ల విచారణను వేగవంతం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విచారణ పేరిట నెలలు గడుస్తున్నా కొత్త సదరం సర్టిఫికెట్ల దరఖాస్తుల కోసం నెల కొండి సచివాలయాల చుట్టూ తిరిగేలా వివిధ రకాల వికలాంగులకు భరోసా ఎక్కడ అని అన్నారు. వివిధ సచివాలయాల్లో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రెండు, మూడు నెలలు తిప్పించడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

'బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేరిస్తే సహించం'

ప్రజాశక్తి - కురుపాం

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ శుక్రవారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆదివాసీ జెఎసి నాయకులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఐండిపల్లి రామకృష్ణ, కోలక గౌరమ్మ అన్నారు. కురుపాంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే గిరిజన జాబితాలో ఉన్న ఆదివాసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన 45 లక్షల జనాభా ఉన్న బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల నిజమైన ఆదివాసీలకు తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున వీటిపై ఆదివాసీ మంత్రి, ఎమ్మెల్యేలు గళమెత్తి ఆదివాసీలకు జరిగే నష్టంపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఏనుగులను తరలించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలోని జియమ్మవలస, కొమరాడ మండలాల్లో సంచరిస్తున్న అడవి ఏనుగుల గుంపును తరిమేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ కురుపాం నియోజకవర్గ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. కొమరాడ మండలంలోని పాలెం, మాదలింగి గ్రామాలలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు, రైతులు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, చెమటోడ్చి పండించిన పంటలు పామాయిల్, మొక్కజొన్న, అరటి తోటలు ఏనుగుల గుంపు ధ్వంసం చేయడం వల్ల అపార నష్టానికి గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ పరిసర ప్రాంతాల్లోకి ఏనుగుల గుంపు విచ్చేసి తిష్ట సంవత్సరాలు గడుస్తున్నా తరలింపు చర్యలు కానరాలేదన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ "కుంకీ" ఏనుగులను కర్ణాటక నుంచి రప్పించి,ఇక్కడి ఏనుగుల గుంపును తరిమి వేస్తామంటూ ఆవేశపూరితంగా చెప్పిన మాటలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదున్నారు. ఏనుగుల గుంపుతో మరింత ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లికముందే కట్టడి చర్యలు చేపట్టి, ఏనుగుల ధ్వంసం మూలంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తూ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న పుస్తకాలు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు

పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలి

శ్రీసాయి నికేతన్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థులు బాగా చదువుకుని ఇటు పాఠశాలకు, అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శ్రీసాయి నికేతన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రొంపిల్లి ఉదయ్ కిరణ్ అన్నారు. శ్రీ సాయినికేతన్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పక్కి సదాశివరావు, పెదిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, పెద్దింటి శ్రీధర్, చిగురువలస లీలాప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు ఇజ్జురోతు తాతినాయుడు, పెద్దింటి ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు నీరివ్వండి

ప్రజాశక్తి పాలకొండ

మనుషులు తాగడానికి సరిపడని నీరు సరఫరా చేయలేని పాలకులు, అధికారులు కనీసం మూగజీవాల దాహార్తి తీర్చడంలో కూడా విఫలమవుతున్నారు. మండు వేసవిలో నీరు లేక మూగజీవులు అల్లాడుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు చెరువులకు నీరు నింపాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు తీసుకోవడం లేదు. తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ నుంచి నీరు విడిచిపెట్టిన దాఖలాల్లేవు. పిఆర్ రాజుపేటలో ఉన్న చెరువు పూర్తిగా అడుగంటి పోయింది. శివారు ప్రాంతాలకు లేకపోవడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : పిఒ

పలుచోట్ల ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ కోరారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన కొత్తవలసలో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు పిఒ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ మహిళలు విద్యతో పాటు ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నారు. అందుకోసం స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలకు కావాల్సిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మహిళలు మంచి పోషకాహారం తీసుకోవాలని, సాంప్రదాయ పంటలను మళ్లీ ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పరంగా మహిళా అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారం అందిస్తామన్నారు. మహిళ స్వయం ఉపాధికి తగిన ప్రోత్సాహం అందిస్తాన్నారు. కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా ఏర్పాటు చేసిన ఎస్ సొసైటీ, కొత్తవలస మహిళా సంఘాలను అభినందించారు. మన్యం జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మెన్ డాక్టర్ .మంచుపల్లి శ్రీరాములు మాట్లాడుతూ ఆదివాసీ మహిళలు విద్య పరంగా ముందుకు రావాలని, బాలిక విద్యను ప్రోత్సహించాలని కోరారు. రెడ్ క్రాస్ తరపున ఎలాంటి సహాయం కోరినా చేస్తామని చెప్పారు. పిఒకు మహిళా సంఘాలు మెమెంటో అందించారు. మహిళాల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే మహిళాలు ఏర్పాటు చేసిన సాంప్రదాయ పంటలు, వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పిఒ సందర్శించి మహిళా రైతలను అభినందించారు. దుడ్డుఖల్లు పంచాయితీకి చెందిన సుమారు 300 మంది మహిళలు హాజరయ్యారు. కార్య క్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, భద్రగిరి ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి, కెవికె మహిళా శాస్త్రవేత్తలు స్రవంతి, ఉమాజ్యోతి, దుడ్డుఖల్లు సర్పంచ్ ఎస్.నీలావతి, ఉపాధి హామీ అంబడ్స్ మెన్ సన్యాసిరాజు, ఎపిఎం రామకృష్ణ, గిరిజన సంఘం నాయకులు సింహాచలం, మాజీ సర్పంచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : అంగన్‌వాడీలకు జ్ఞాపికలను అందజేస్తున్న సిడిపిఒ రంగలక్ష్మి

మహిళల హక్కులు పై అవగాహన పెంచుకోవాలి

పార్వతీపురం రూరల్ : మహిళలు సమాజంలో పురుషులతో సమానంగా అభివృద్ధి చెందేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకొని అభివృద్ధిలో పయనించాలని ఎంపిపి మజ్జి శోభారాణి అన్నారు. మహిళ సాధికారక ఉత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో స్త్రీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమకున్న హక్కులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జడ్పిటిసి బలగ రేవతమ్మ, సర్పంచు రెడ్డి భారతి, కౌన్సిలర్ సరిత తదితరులు మాట్లాడారు. ముందుగా కేక్ కట్ చేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహనరావు, ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు, ఎంఇఒ 1,2 వై.విమల కుమారి, శ్రీనివాసరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, పార్వతీపురం, కొమరాడ, బలిజిపేట, సీతానగరం, మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలు అందరికీ ఆదర్శంగా ఉండాలి

కొమరాడ : మహిళలు సమాజంలో అందరికీ ఆదర్శనీయంగా ఉండాలని స్థానిక ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థినిలు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెబుతూ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు చేపడుతూ మహిళలను చైతన్యపరుస్తూ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినిలు చదువు పట్ల ఆసక్తి కనబర్చి మంచి ఉత్తీర్ణతో మార్కులు సాధించుకునే జీవితాల్లో మంచి స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న హక్కులను వినియోగించుకొని చట్టాలను గౌరవిస్తూ, వాటిపై అవగాహన ఉండాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడ రంగాల్లోనూ మహిళలు రాణిస్తూ ఉన్నత శిఖరాల్లో ఉన్నారని, కాబట్టి ప్రతి విద్యార్థినీలు బాగా చదువుకొని కుటుంబానికి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

వీరఘట్టం : స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య అధ్యక్షులు కె.లలితకుమారి మాట్లాడుతూ మహిళను అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం మండలం సంత నర్సిపురానికి చెందిన జై సంతోషిమాత కోలాట బృందంచే అనేక సినీగేయాలకు కోలాటం, ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, మండల మహిళా సమైక్య కమిటీ సభ్యులతో పాటు సీసీలు, విఒఎలు పాల్గొన్నారు.

పాచిపెంట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిడిపిఒ బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి మహిళా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిడిపిఒ మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరు మహిళలు ఆత్మగౌరవంతో స్వశక్తితో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకొని స్త్రీ శక్తి అంటే ఏమిటో ప్రపంచానికి తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : ఐసిడిఎస్ సిడిపిఒ పి.రంగలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన 50 మందికి ప్రోత్సాహం కింద మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్‌వాడీలకు జ్ఞాపికలను అందజేస్తున్న సిడిపిఒ అనంతలక్ష్మి

పేదరికం లేని సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పీ4 సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బందితో పీ4 సర్వేపై సమీక్ష నిర్వహించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో వున్న 20 శాతం మందిని గుర్తించి పేదరికాన్ని దూరం చేయడం లక్ష్యమని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఈనెల 8 నుంచి 28 వరకు ఇంటింటా సర్వే జరపాలని సూచించారు. ఈ సర్వే కారణంగా ప్రభుత్వ పథకాల అమలుపై ఎటువంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. సర్వేలో పేర్కొన్న 27 ప్రశ్నలకు సమాధానాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

మక్కువ : స్వర్ణాంధ్ర -2047లో భాగంగా చేపట్టనున్న పి 4 సర్వే శనివారం నుండి ఈనెల 13 వరకు గ్రామాల్లో శత శాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి వి.తిరుపతయ్య, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి అధికారులను ఆదేశించారు. అన్ని సచివాలయాల పరిధిలోని సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషెరీస్, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఎన్ని ఇబ్బందులు ఎదురొచ్చినా పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్నర్(పి-4) సర్వే పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి యజమానితో పాటు కుటుంబ సభ్యులు వివరాలు సేకరించాలన్నారు. సంక్షేమ పథకాలు లబ్ధిపొందుతున్న వారి వివరాలు, అర్హులై ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు రాని వారి వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టి.రమణమూర్తి నాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : పేదరికం లేని సమాజం లక్ష్యంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పి4 సర్వే ప్రక్రియను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.పైడితల్లి ఆధ్వర్యంలో పీ4 సర్వేపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు సర్వే చేయాలని తెలిపారు. పేదల అవసరాలను గుర్తించి, వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూప కల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పి4 సర్వేను పగడ్బందీగా చేయాలని జియ్యమ్మవలస మండల ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలను కచ్చితంగా చేయాలని, అనంతరం మీ యాప్‌ల్లో పొందుపర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎంసిహెచ్ సత్యప్రసాద్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సీతానగరం ఎంపిడిఒకు వినతి అందజేసేందుకు వచ్చిన ఎఎన్‌ఎంలు

సర్వే నుంచి మినహాయించాలి

సీతానగరం : పి ఫోర్ సర్వే నుంచి సచివాలయ ఎఎన్‌ఎంలకు మినహాయింపు ఇవ్వాలని సీతానగరం, పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామ సచివాలయాల ఎఎన్‌ఎంలు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావును కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య శాఖ పరంగా ఇప్పటికీ అనేక రకమైన సర్వేలు చేస్తున్నామని, అలాగే గ్రామ సచివాలయ పరిధిలో అనేక రకాల సర్వేలు చేస్తున్నామని, ఈ సర్వేలతో ఆరోగ్య, మానసిక సమస్యలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతే కాకుండా రెండు శాఖల మధ్య పనులు ఏకకాలంలో చేయాలని, అధికారులు ఒత్తులు చేయడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఏదైనా ఒక శాఖాపరమైన పని చేయడమంటే చేయగలమని ఏకకాలంలో రెండు రకాల పనులు చేయడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా రకరకాల సర్వేలతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదం వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖ సంబంధించి సర్వేలు జరుగుతున్నాయని, ఈ సర్వేలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఎఎన్‌ఎంలు బి.రమాదేవి, ఇ.ఇందిర, రవణమ్మ, గౌరి, సచివాలయ ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పోడు భూముల్లో జీడి మొక్కల తొలగింపు ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలస పంచాయితీ సీతంపేట గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల్లోని జీడి తోటలను ఫారెస్ట్ అధికారులు తొలగించకుండా ఆపాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని సంగంవలస పంచాయితీ, సీతంపేట పరిధిలో గల అటవీ భూముల్లో సుమారు 50 కుటుంబాలు 25 ఏళ్ల నుంచి పోడు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగించుకొంటున్నారు. అలాగే ఆ భూముల్లో ఐటిడిఎ వారు ఇచ్చిన జీడి మొక్కలను పోడు భూముల్లో వేసుకొని సాగు చేసుకొంటున్నారన్నారు. ఆ భూములకు పోడు పట్టాలు మంజూరు చేయమని పలుమార్లు ఐటిడిఎ వారికి దరఖాస్తు చేసుకోగా, కొంత భూమికి మాత్రమే పట్టాలిచ్చారన్నారు. మిగతా భూమి విషయమై పట్టాలు మంజూరు చేయమని కలెక్టర్‌తో పాటు పిఒను, ఎమ్మెల్యేను కలిశామన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో పట్టాలు ఇప్పించమని దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఆ భూములపై గిరిజనులు జీడి మొక్కలు వేసుకొని ఫలసాయాన్ని అనుభవిస్తున్నారని, అయినప్పటికీ ఫారెస్ట్ వారు నిత్యం గిరిజనులను వేధిస్తూ, బెదిరిస్తున్నారని ఆందోలన వ్యక్తంచేశారు. మళ్లీ గిరిజనులపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ భూముల విషయమై కోర్టుల చుట్టూ గత రెండేళ్ల నుంచి 13మంది గిరజనులు తిరుగుతున్నారని, ఇప్పుడు మళ్లీ ఆ భూముల్లో జీడి మొక్కలు తొలగించి ఖాళీ చేయమని గిరిజనులను బెదిరించి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. గిరిజనుల సాగులో ఉన్న జీడి తోటలను అటవీఅధికారులు జెసిబితో తొలగిస్తున్నారన్నారు. కావున దీన్ని వెంటనే నిలిపివేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్మ, శ్రీనునాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - సీతంపేట

జన చేతన వ్యవస్థాపకులు - ఆదివాసీల ఆరాధ్యులు మజ్జి శంకరరెడ్డి ఆశయ సాధన లక్ష్యంగా జన చేతన స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని సంస్థ కార్యదర్శి బగాది శశి భూషణ చౌదరి అన్నారు. శంకర రెడ్డి 17వ వర్ధంతి మండలంలోని గొయిదిలో శుక్రవారం నిర్వహించారు. తొలుత శంకరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చౌదరి మాట్లాడుతూ శంకర రెడ్డి సవర తెగ మాతృభాషలో విద్యా బోధన ద్వారా గ్రామ స్థాయిలో సవర భాషా పాఠశాలలు నెలకొల్పి సవర భాషలో బోధనకు కృషి చేసి ఆదివాసీల అక్షరాస్యత శాతం పెంచి, ఆదివాసీలకు ఆరాధ్యుడయ్యారని పేర్కొన్నారు. అదివాసీల్లో ఉన్న భయం పోగొట్టి, బేరమాడే శక్తి, ప్రశ్నించే తత్వం అలవాటు చేశారని అన్నారు. సంతల్లో ధర్మకాటాలు ఏర్పాటు చేసి వారికి జరుగుతున్న దోపిడీ, అన్యాయంపై చైతన్యపర్చి విముక్తి కల్పించారని, ఆదివాసీల అటవీ హక్కులు, చట్టాలు, మహిళా చట్టాలు, బాలల హక్కులు, విద్య కోసం నిరంతరం శ్రమించారని చౌదరి అన్నారు. సంస్థ అధ్యక్షులు ఎం.వసంత కుమారి మాట్లాడుతూ ఆదివాసీలు, బడుగు బలహీనర్గాల అభివృద్ధికి, అభ్యుదయానికి కృషి చేస్తూ వారిలో ఒకరిగా మమేకమైపోయారని అన్నారు. స్థానిక సర్పంచ్ కుండంగి రమణమ్మ మాట్లడుతూ మా ఆదివాసీలకు మాట్లాడడంతో పాటు మాలో రాజకీయ చైతన్యం కల్గించారని పేర్కొన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు బిడ్డిక సరోజినమ్మ మాట్లడుతూ మహిళా సంఘాలు ఏర్పాటు, పొదుపు అలవాటు చేసి మా ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. అనంతరం పాఠశాల పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లు, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ మాజీ అధ్యక్షులు బిడ్డిక కళావతి, జనచేతన సిబ్బంది ఎల్.కృష్ణారావు, ఎల్.శేషుకుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో గురువారం రాత్రి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం గ్రామానికి చెందిన పి. జ్యోతింద్ర నారాయణ్ (42) విశాఖపట్నంలో నివసిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం వెళ్తుండగా విమానాశ్రయం ట్రంపెట్ సమీపంలో హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘనంగా సిర్లి పోతన్న, ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సిర్లి పండగ సందర్భంగా పోతన్న, ఎల్లమ్మను పట్టణంలో పాలకొండ రోడ్‌లో ఉన్న దుర్గాదేవి ఆలయం వద్ద ఉన్న గుడిలో భక్తులు శుక్రవారం ఉదయం 6 గంటలకు చేరుకుని పోతన్న ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బియ్యం, కోడిగుడ్లు, నల్ల ఉలవలు, పసుపు కొమ్ములు,వేప కొమ్మలను. తీసుకుని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పూజారులు సింగరోతు పోతున్న, శంకర్రావు, బుచ్చమ్మలు ఆలయంలో ఉన్న నాగేంద్రుని పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్ట మన్నును భక్తులకు అందజేశారు. ఈ పండుగకు పట్టణ ప్రాంత ప్రజలే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో వెలసిన సిర్లి పోతన్న, ఎల్లమ్మ జాతర కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రముఖ యజ్ఞ కర్త సర్వ జోషులు వెంకటలక్ష్మి నరసింహ శర్మ యాజి ఆధ్వర్యంలో దర్శనం కొచ్చే భక్తులకు ఏ విధమైన ఆటంకం లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు సాయిరాం భక్తులు మజ్జిగ సరఫరా చేశారు.

సీతానగరం : స్థానిక దేవర వీధిలో శుక్రవారం సిరిలి ఎల్లమ్మ యాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఈ జాతరకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి మొక్కలు చెల్లించుకుంటూ గుడి వద్ద పూజలు నిర్వహించారు. ఈ జాతర మహాశివరాత్రి పోయిన తొమ్మిది రోజుల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ జాతరలో ఎల్విఆర్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోరా, మంచినీటి ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు.

పార్వతీపురంలో పూజలు చేస్తున్న యాత్రికులు

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అన్ని వార్డుల్లో తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన డిఇ శ్రీనివాసరాజుతో కలిసి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా జరిగే తోటపల్లి హెడ్ వాటర్ వర్క్ వద్ద ఉన్న పంప్ హౌస్‌ను పరిశీలించారు. తోటపల్లి రిజర్వాయర్ నుండి వచ్చే నదీ జలాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంపు హౌస్ వద్ద ఉన్న సిబ్బందితో తాగునీరు సరఫరా జరిగే పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మోటార్ల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ అధికారుల నుంచి ముందస్తు సమాచారం తీసుకోవాలని సూచిస్తూ, విధి నిర్వహణలో అలసత్వవహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రాణంతీసిన అతివేగం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం అలమండ పంచాయతీ నీలకంఠాపురానికి చెందిన కొండగొర్రి నాగేశ్వరరావు (46) మృతిపై ఇన్‌ఛార్జి ఎస్సై పి.అనిష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం రాత్రి నీలకంఠాపురానికి చెందిన నిమ్మక శంకరరావు కొండగొర్రి నాగేశ్వరరావు, పాలక లాలిబాబును తన బైక్‌పై ఎక్కించుకొని గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దిడిలో జరుగుతున్న గ్రామ దేవత పండగకు బయలుదేరారు. కాగా శంకరరావు మితిమీరిన వేగంతో బైకును నడపడంతో బైకు బోల్తా పడిన ఘటనలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని 108కి నెంబర్‌కు ఫోన్ చేసి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మరణానికి ముఖ్య కారణం శంకరరావు మితిమీరిన వేగంతో బండి నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని మృతుని సోదరుని కుమారుడు కొండగొర్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.